రేవతి సూర్యోదయం

-పి.ఎస్.నారాయణ

నన్ను చూస్తూనే పేలవంగా నవ్వింది.

''దేనికి రమ్మన్నారట?''

''ఎంత అసహ్యకరమైన విషయాన్నయినా మనిషి భరించగలిగే గుండె నిబ్బరం వుండాలి. అందునా మొగవాడికి. ఏదో నేను అవాకులు, చెవాకులూ పేలానని రోడ్డుమీద విడిచిన గుడ్డల మూటను విసిరేసినట్లుగా విసిరేసి వెళ్లిపోయారే. అది బాగున్నదా మీకు?''

''అందంగా వున్నాయి కదా అని కోడెదూడల్ని, నాగుపాముల్ని నట్టింట్లో తెచ్చి పెట్టుకోలేంకదా''

''నేను ఆడపిల్లనండీ. ఇంకా దేవుడు కేటాయించిన వందేళ్లలో నాలుగోవంతు కూడా ఖర్చుకాని సుకుమారిని'' రోషంగా అన్నది.

నాకు కోపంలోనుంచే ఆమె మాటలకు నవ్వు పుట్టుకొచ్చింది.

''ఎందుకు ఈ మాటలన్నీ... నన్ను పిలిపించిన కారణం చెబితే విని వెళతాను. ఇంతకీ డబ్బేమైనా కావాలా?'' ఎంత నిగ్రహించుకున్నా నా మాటల్లో శ్లేష ఆగలేదు.

''ఊరికే తీసుకునే అలవాటు నాకులేదు'' తల వంచుకుంటూ అన్నది సరోజ.

''ఛండాలపు పనులకు డబ్బు వెచ్చించడం నాకూ ఇష్టంలేదు'' తుపాకీ గుండులా వదిలిన నా మాటలు ఆమె శరీరాన్ని తూట్లు తూట్లుగా పొడిచినట్లుగా ఆమె విలవిలలాడడం నాకు స్పష్టంగా కనబడింది. ఆమె ముఖం తెల్లగా పాలిపోయింది.

ఆమె ఎర్రని, సన్నని క్రింద పెదిమ వడలిన లేత ఆకులా క్రిందకు జారింది. ఆమె చూపుల్ని చూస్తుంటే జాలివేసింది. కానీ అలాంటి హీనాతి హీన చరిత్రురాలి మీద నాకు కరుణ, దయ ఏమిటి?

''నేను ఇలా అవడానికి కారణం ఎవరంటారు?'' చేతకాని అసహాయత నుండి పుట్టుకొచ్చిన ప్రశ్నలా వున్నది అది.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ చప్పట్లు కొట్టి ''ఏ చేతిని తప్పంటాము?''

''నిజమే. నా తప్పులేదని నేననను. కానీ నేను ఇలా అవడానికి కారణమయిన ఆ బాస్టర్డ్ గురించి తెలుసుకోవాలని మీకు లేదా?''

''దానివలన నేను పొందే లాభం?''

''ఓ అర్భకురాలయిన ఆడకూతురంటే జాలి''

''ఆ జాలి నాకు ఆనందాన్ని కలిగిస్తుందా?''

''ఊహూ... కానీ మీలోని ద్వేషాన్ని చిన్నగానైనా కరిగించుకోగలుగుతారుగదా?''

''నాకు ఎవ్వరిమీదా కోపంలేదు. ద్వేషంలేదు. నాకు ఎందుకు చెబుతారు ఇవన్నీ... ఆఫ్ట్రాల్ ఒకే వీధిలో ఎదురెదురుగా వున్న ఇళ్లల్లో వుంటున్నవాళ్లం. ఈ రోజువున్న వాళ్లం రేపు వుంటామనే గ్యారంటీలేదు. ఏ కారణంతోనైనా మారిపోవచ్చు''

చటుక్కున ఆమెలేచి నిలబడింది ''ఫర్ గాడ్ సేక్... మీరు ఇక్కడ నుంచి వెళ్లిపోవద్దు''

''కారణం?'' ఓ అడుగు వెనక్కు వేశాను.

''మీరు తుపానులో చిక్కుకుని అస్తవ్యస్తమైపోతున్న నా మనస్సుకు శాంతిని ప్రసాదించగలరు కనుక''

''నాన్సెన్స్. నేనెవరు? మీరెవరు? ఏ విధంగా మీకు శాంతి లభిస్తుంది?''

''నేను ఇలా అవడానికి కారణమయిన ఆ ఛండాలుని సర్వనాశనం చేసేటంతవరకూ మీరు నాకు సాయం చేస్తారనే నమ్మకం నాకున్నది కనుక''

★★★

ముసలమ్మ రెండు కప్పులతో కాఫీ తెచ్చి మా మధ్య వున్న టీపాయ్ మీద పెట్టింది. అప్పుడు సాయంత్రం అయిదు గంటలయింది.

ఆరోజు 'మళ్లీ తరువాత కలుస్తాను' అని చెప్పి ఆ మేడ మీదనుంచి విసురుగా బయటకు వచ్చేసిన తరువాత మూడురోజులు దీర్ఘంగా ఆలోచించాను, ఆమెకు నేనే విధంగా సహాయం చేయగలను అని!

ఒకప్రక్క మనస్సు పీకుతూనే వుంది. అనవసరంగా ఈ రొంపిలో నేను ఇరుక్కుంటున్నాను అని. మంచి మనుష్యులతో ఏం చేసినా మనకు అపకీర్తి రాదు. సరోజలాంటి స్త్రీల వ్యవహారాల్లో తల దూర్చడం అంటే నా గౌరవాన్ని బజార్లో నిలబెట్టినట్టే!

మనస్సంతా కలత బారుతున్నది. ఆమెను గురించి ఆలోచిస్తుంటే నీరసం ఆవరిస్తున్నది. సంపెంగ పూల వెనుక దాక్కున్న నాగుబాములా వున్న ఆమె ప్రవర్తన నన్ను కాటువేస్తే?

నేను ఊహించలేని పరిస్థితి అది. అయినా అందమైన అజంతా శిల్పంలాంటి ఆమె కృంగి కృశించి పోతుంటే నా మనస్సు నిశ్శబ్దంగా ఊరుకోలేకపోతోంది.

ఆమె కాలిపోతున్న జీవితాన్ని చూస్తూ అసహాయంగా వుండిపోలేనేమో అనిపిస్తోంది.

కర్కశమైన మొరటు పాదాల కింద తొక్కి వేయబడుతున్న ఆమెను నలుగురి నడుమా మమత, ప్రేమ, మానవత్వం పొందే మనిషిగా చేయలేనా? సభ్య సమాజంలో ఆ అందమైన బొమ్మకు ఒక ఉన్నత స్థానాన్ని ఏర్పరచలేనా?

నాలో ఏర్పడుతున్న ఈ సంఘర్షణకు సమాధానం అన్నట్లుగా నేను తిరిగి ఆ మేడ మెట్లెక్కాను చిరుజల్లుతో తడుస్తూ. సరోజ ముందు కూర్చున్నాను.

వేడి పొగలు క్రక్కుతున్న కాఫీని చప్పరిస్తున్నప్పుడు వాకిట్లో చిరుజల్లు కాస్తా జడివాన అయింది.

''ఓ భ్రష్టుడి అమాయకమైన చూపులవలలో చిక్కుకుని మోసపోయాను''

''ఎవరతను?''

''రమేష్ అని నాతో కలిసి చదువుకున్నాడు. సంస్కారం ఉట్టిపడేలా ప్రవర్తించి నన్ను, నా మనసును, తనవైపు లాక్కుని నన్ను ఆక్రమించి పెద్దలు తెచ్చిన ఓ ధనవంతుడి కూతురు తెచ్చే డబ్బు మోజులో పడి ఆమె మెళ్లో మూడు ముళ్లు వేసి నన్ను సర్వనాశనం చేశాడు.''

రెండవ వారం

కర్కశమైన మొరటు పాదాల కింద తొక్కి వేయబడుతున్న ఆమెను నలుగురి నడుమా మమత, ప్రేమ, మానవత్వం పొందే మనిషిగా చేయలేనా? సభ్య సమాజంలో ఆ అందమైన బొమ్మకు ఒక ఉన్నత స్థానాన్ని ఏర్పరచలేనా?

''మీరూ తొందరపడ్డట్టు కాదా?''

''నేను చెప్పానుకదా నా తప్పూ వున్నదని. అతడి మాటలు నమ్మి ఇంట్లో నుంచి అర్ధరాత్రి కట్టుబట్టలతో పారిపోయాను. తరువాత డెబ్బై రెండుగంటలలోనే నేను మోసగింపబడ్డానని తెలుసుకున్నప్పుడు నా బ్రతుకే నాకు బరువయింది. నా జీవితమే నాకు అసహ్యామేసింది.''

''మరి ఏం చేశారు అప్పుడు?''

''ఏమీ చేతకాక మరల అర్ధరాత్రి మా ఇంటి వాకిట్లో కాలుపెట్టాను తలొంచుకుని''

నేను మాట్లాడలేకపోయాను.

ఆ రోజున ఆ క్షణాన ఆమెను ఓదార్చే ఓర్పు ఆమె తల్లిదండ్రులకు లేకపోయిందని నాకు అర్థమయింది.

''నన్ను బిచ్చగత్తెకంటే హీనంగా తరిమికొట్టారు నన్ను కన్న తల్లిదండ్రులు. అప్పుడే ఒక నిర్ణయానికి వచ్చేశాను''

''ఇలా బ్రతకాలనా?'' ఎంత నిగ్రహించుకున్నా నా కంఠంలో నా మాటల్లో ఎగతాళి బహిర్గతం కాకుండా ఆగలేదు.

''అవును'' ఆమె కంఠం చాలా గంభీరంగా వున్నది. ''ఎందుకో తెలుసా?''

''చెప్పండి''

''సరైన సంపాదన లేని మా నాన్న ఇంకేం పని లేనట్లుగా సంవత్సరానికోసారి మా అమ్మను మరో బిడ్డకు తల్లిని చేస్తూ మా కుటుంబాన్ని అధః పాతాళానికి నెట్టివేశాడు.



మాకు కట్టుకోవడానికి సరైన గుడ్డలులేవు. కడుపునిండా భోజనానికి కూడా మొఖం వాచిపోయేలా ఏడ్చేవాళ్ళం. అలాంటి బ్రతుకులు ఈడుస్తూనే నేను ట్యూషన్లు చెప్పి డబ్బులు సంపాదించుకుని ప్రైవేటుగా ఎమ్మే పాసయ్యాను. ఎమ్మే పాసయి ఆ భ్రష్టుడి వలలోపడి నా తెలివిని, భవిష్యత్తును గంగలో కలిపేశాను'' ఆమె దుఃఖాన్ని ఆపుకోలేనట్లుగా గొంతు బొంగురుపోయింది.

''ఒక్కోసారి చిన్న సంఘటన కూడా జీవితాన్ని అస్తవ్యస్తం చేసేస్తుంది'' సానుభూతిగా అన్నాను.

ఆమె ముఖం ఎర్రబడసాగింది. ఆమె పిడికిళ్లు బిగుసుకుంటున్నాయి. ఆమె ఊపిరి బిగపట్టుకుంటున్నట్లు రెప్పలార్పకుండా కనుగుడ్లను సూదుల్లాపెట్టి ముందుకు చూస్తోంది. క్షణంలో ఆమె ముఖం రక్తపుముద్దలా అయింది. ఆమె కళ్ళు అగ్నిగోళాలయ్యాయి. ఆమె ఆవేశంతో ఊగిపోతూ నరాలు, ఉబ్బిన పిడికిళ్లను సోఫామీద కొడుతూ ''సంపాదిస్తాను... డబ్బు సంపాదిస్తాను. కోరినంత డబ్బు సంపాదిస్తాను. ఈ వెధవలను నా చుట్టూ ఆటబొమ్మల్లా తిప్పుకుంటాను. నా ఇంటిముందు, నోరు తెరుచుకుని నా చూపుల కోసం పడిగాపులు పడి వుండేలా నా అందాన్ని వలలా విసిరి వాళ్లను సర్వనాశనం చేస్తాను. వాళ్ల సమాధులమీదుగా పైకి లేస్తూ నన్ను నేను నిలబెట్టుకుని నా తరువాత అమ్మ కడుపున పుట్టిన ఆరుగురికి అందమైన జీవితాన్ని ప్రసాదిస్తాను'' అరుస్తున్నట్లుగా అంది.

మొట్టమొదటిసారిగా సరోజ వంక క్షణం జాలిగా చూసాను- ఆమె కొవ్వొత్తి అవ్వబోతున్నందుకు.

''అదే-మరోసారి మా ఇంటి గడప ఇవతలగా నిలబడి మా నాన్నకు చెప్పినప్పుడు ఆయన ఒక్క క్షణంకూడా ఆలస్యం చేయకుండా 'మంచి ఆలోచన' అంటూ నన్ను లోపలకు ఆహ్వానించాడు. అంతేగాదు నన్ను మా ఊరునుంచి మాకుతెలిసిన వాళ్లందరికీ

ధూరంగా ఇక్కడకు తీసుకువచ్చి ఈ మహాపట్టణంలో దింపి నేనేదో గౌరవప్రదమైన బ్రతుకుతో డబ్బు సంపాదిస్తున్నట్లుగా మా ఊరి వారి ముందు గొప్పలు చెప్పుకుంటున్నారు''

ఆమె కంటి వెంట నీరు ధారగా కారుతున్నది.

ఆమె చటుక్కున లేచి నిలబడింది.

''ఐ హేట్ దట్ బగ్గర్. ఐ వాంట్ టు కిల్ దట్ బాస్టర్డ్''

ఆమె శరీరంలోని నరాలన్నీ ఫట్‌మని తెగేలా ఊగిపోతున్నది.

''నేను పనికిరాను. నా రక్తం మాత్రం వాళ్లకు తిండి పెట్టాలి''

★★★

ఉదయాన్నే ఎదురింటి మేడమీద భాగంలో నుంచి పెద్ద పెద్ద కేకలు వినబడుతుండగా ముందు కిటికీలో నుండి అటువైపు చూశాను.

ఆ అరుపులన్నీ వాళ్ల బెడ్‌రూంలో నుండే.

సరోజకు డబ్బులిచ్చి కొన్ని గంటలు ఆమెను కొనుక్కున్న మనిషి అరుపులు కాదుగదా?

ఎంతో వేదనతో అటే చూస్తూ వుండిపోయాను చాలాసేపు నిశ్శబ్దంగా.

తరువాత పావుగంటకు ఆ శబ్దాలు ఆగిపోయాయి. ఓ ముసలాయన బయటకు వచ్చాడు చేతిలో చిన్న గుడ్డ సంచీతో.

'మేడ మెట్లు దిగి వాకిట్లో గేటు దగ్గర నిలబెట్టివున్న ఆటో ఎక్కాడు. అతడు ఎక్కడం ఆలస్యం ఆటో వెళ్లిపోయింది.

నాకు అప్పుడు గుర్తువచ్చింది ఆయన ఎవరో... సరోజ తండ్రి. సరోజ అసహ్యించుకుని ద్వేషించే కన్నతండ్రి.

సాయంత్రం ఆఫీసునుండి వస్తూ మా వీధి మొదట్లో వున్న జనరల్ స్టోర్స్ నుంచి ఫోను చేస్తున్న సరోజను చూసి ఆగాను. ఆమె ఫోను పెట్టేసి డబ్బులిచ్చి రాగానే ఆమెతో అడుగులు కలిపాను.

నన్ను చూసి ఆమె తడబడింది.

నాకు అర్థమయింది, ఆమె తడబాటుకు కారణం. ఆమె ఫోను చేసి కనుక్కున్నది 'ఏ హోటల్‌కి, ఎన్ని గంటలకి, ఏ రూంకు రావాలి'

ఆమె కళ్లు వాలిపోయాయి నా ఖేదమయిన నవ్వును చూసి.

'మీ నాన్న వచ్చినట్లున్నాడు?''

ఆమె ఉలిక్కిపడ్డట్టుగా తలెత్తింది. ఆమె పెదిమలు అల్లల్లాడినాయి 'అవును' అన్నట్టుగా.



''డబ్బు కోసమా?'' నాకు అర్థమయిన అతడి అరుపుల్లోని అర్థాన్ని మాటల రూపంలో పెట్టాను.

నిజమేనన్నట్లుగా ఆమె మౌనం.

''ఇచ్చిన డబ్బు చాలట్లేదనా?''

''అందుకే నానా గొడవ చేసి వెళ్లాడు'' ఆమె కళ్లల్లాగానే కంఠం కూడా తడుస్తున్నదని స్పష్టమయింది నాకు.

''ఏమిటి మీమీద ఆయన అథారిటీ''

''నన్ను ఆయన కూతురిగా ఈ భూమ్మీద బ్రతకనిస్తున్నందుకు''

''నాన్సెన్స్... మీరు బయటకు వచ్చేసిన తరువాత వాళ్లకూ మీకూ సంబంధమేమున్నది? ఒకసారి ఆ యింటి నుంచి మీరు వెళ్లగొట్టబడ్డారనే విషయాన్ని మరిచిపోయారా?''

''కానీ తిరిగి మళ్లీ వెళ్లాను గదా!''

''దేనికి? దేనికి వెళ్లారు? తిండికి గతిలేక అల్లల్లాడుతున్న ఆ కుటుంబాన్ని ఆదుకుంటానని వెళ్లారు. సాయం చేస్తానని వెళ్లారు. అటువంటి మిమ్మల్ని చూచి సంతోషించాల్సింది పోయి దౌర్జన్యం ఎందుకు సహించాలి?''

బరువుగా పడుతున్న అడుగుల నడుమ నిశ్శబ్దం...ఆమె మాట్లాడలేకపోతున్నట్లుగా ఆగిపోయింది.

''చూడండి. మా అమ్మమీద, నా తరువాత పుట్టిన తమ్ముళ్లమీద, చెల్లెళ్లమీద జాలితో వాళ్ల దౌర్భాగ్యాన్ని చూడలేక ఎట్లాగూ నాశనమయ్యానుగదా అని వాళ్లకేదో చేద్దామని ఆశపడ్డాను. కానీ ఆ రాక్షసుడు నా సహాయాన్ని వాళ్ల జన్మహక్కులా భావిస్తున్నాడు'' ఆమె వేదనాభరిత కంఠం ఆమెకే కాదు, ఆమె మాటల్ని వినేవాళ్లను కూడా కృంగదీస్తోంది.

''ఈసారి ఇంట్లో కాలు పెడితే మర్యాదగా వుండదని చెప్పండి'' కోపంగా అన్నాను.

సరోజ నవ్వింది చాలా చిన్నగా. ''నిజమే. దాని ఫలితం అనుభవించేది ఎవ్వరు? ప్రేమ, అభిమానం అనే పేగులు నన్ను వాళ్లతో బంధించినాయి. వాటిని తెంపేసాననుకోండి. చాలా తేలికే. అయినా తరువాత మళ్లా మామూలే. అందుకే ఆ మూర్ఖుడు నాలోని ఆ పేగులతో ఆడుకుంటున్నాడు'' ఆమె గుండెల్లో నుండి వెలువడుతున్న బాధ నన్ను వివశుణ్ణి చేస్తోంది.

ఇంటిదాకా మౌనంగా నడిచాం.

ఆమె ఇంట్లోకి వెళ్ళబోతున్నప్పుడు ''బాధపడకండి. మీ ఈ సమస్యకు ఏదైనా గౌరవప్రదమైన పరిష్కారం దొరుకుతుందేమో ప్రయత్నిస్తున్నాను. త్వరలోనే నా ఆలోచనలు ఓ దరికి రావచ్చు. అప్పుడు వస్తాను మీ దగ్గరకు'' నేను వడివడిగా ముందుకు అడుగులు వేశాను. 'మీరు ఇలా జీవంలేని బొమ్మలా అందరి చేతుల్లోనూ ఆడడం నాకిష్టంలేదు' ఆమెకు వినబడీ వినబడకుండా గొణుక్కున్నాను.

★★★

రుచి(త) కబుర్లు

'జాబిలమ్మ పెళ్లి'ద్వారా పరిచయమైన ఆ తర్వాత 'సరదాల సంసారం', 'దేవుడు', 'చెలికాడు' చిత్రాలలో నటించినా రుచితా ప్రసాద్‌కి మంచి గుర్తింపు రాకపోవడమే కాదు, అవకాశాలూ లేకుండా పోయాయి. ఈ విషయమే ఆమెని కదిలిస్తే ''ఏమోనండీ! వరసగా నాలుగు చిత్రాలు ఫ్లాప్ అయ్యేసరికి నన్ను అందరూ ఐరెన్‌లెగ్ అంటున్నారు, అదే నేను ఒక హిట్ ఇస్తే చాలు, తిరిగి అందరూ నన్ను 'గోల్డెన్ లెగ్' అనే అంటారు. గతంలో రమ్యకృష్ణను కూడా మొదట్లో ఐరెన్‌లెగ్ అన్నవాళ్లే ఆ తర్వాత ఆమె ఏ స్థాయికి వెళ్లిందో చూశారుగా...'' అంటూ తనను తాను రమ్యకృష్ణతో పోల్చుకుని తృప్తి పడింది. 'మరి ఎక్స్‌పోజింగ్ విషయంలో అభ్యంతరాల సంగతి ఏంటి?' అంటే- ''అదేం లేదు..ఎక్స్‌పోజింగ్‌కి అభ్యంతరం లేదు'' అంటూ సరికొత్తనిర్ణయం వినిపించింది. ఇదిలా వుంటే, రుచిత హైదరాబాద్‌లో వుంటే తరచూగా బాలకృష్ణకి ఫోన్ చేస్తుంటుందని వినికిడి..ఎందుకబ్బా?

-జె.వి.బాబు

ఆదివారం.

వడివడిగా మెట్లెక్కాను మా ఇంటి ఎదురు మేడ మీదకు.

నాకు చాలా ఆనందంగా వుంది.

రామం చేసిన ప్రయత్నం ఫలించింది.

ఓ కంపెనీ ఎమ్‌డీతో మాట్లాడాడట. ఆయన సరోజను పంపమన్నాడట. అక్కడ గౌరవప్రదమైన జీతమూ, జీవితమూ కూడా వుంటాయని చెప్పాడు.

అయితే వాడి అనుమానాలు వాడివి. ''అసలు ఆ రంగంలోకి దిగనే కూడదు. ఒకసారి దిగిన తరువాత జీవితాన్ని సాఫీగా నడపడం కష్టమే అవవచ్చు. సరే అయినా నీ ప్రయత్నాన్ని నేనెందుకు కాదనాలి. చూద్దాం. బాగుపడితే ఆ అమ్మాయి అదృష్టం. కాదూ ఆ అమ్మాయి ఖర్మ''

ఎండ మండిపోతున్నది. సంశయిస్తూనే దగ్గరకువేసివున్న తలుపు నెట్టాను. ఎదురుగా సోఫాలో ముసలమ్మ కూర్చుని వుంది. నన్ను చూస్తూనే లేచి ''కాసేపుండి రాకూడదు. ఎవరో స్నేహితులతో మాట్లాడుతున్నది'' అన్నది తలొంచుకుని.

నాకు అర్థమయింది. ఒక్కక్షణం అక్కడ వుండబుద్ధి కాలేదు. మెట్లెక్కినంత వడివడిగానే దిగి నా గదిలోకి వచ్చేశాను.

నాకు చాలా అసహ్యమేసింది.

ఆ స్నేహితుడు అనబడే వ్యక్తి ఆమెకు డబ్బులిచ్చి ఆ క్షణాన ఆమె రక్తాన్ని త్రాగేస్తున్నాడు.

ఛ! ఛ! ఎలాంటి మనిషితో నేను వ్యవహారాన్ని పెట్టుకున్నాను. ఎర్రటి రక్తమంటేనే ఎంత జుగుప్సో ఆ మేడ మెట్లెక్కాలన్నా అంతే జుగుప్సగా వుంది.

కొన్ని గంటలవరకూ ఆ చికాకు నుండి కోలుకోలేకపోయాను.

సాయంకాలానికి మరల దృఢ చిత్తుడను కాలేకపోయాను.

ఎన్ని మబ్బులయినా ఆకాశపు స్వచ్ఛతను కలుషితం చేయలేకపోవచ్చు. తాత్కాలికంగా అడ్డుపడి అశాంతిని కలిగించడమే తప్ప.

అలాగే నా మనస్సులోని ఆమెను సరైన దారిలో పెట్టాలనే దృఢ నిశ్చయాన్ని ఈ చిన్న చిన్న సంఘటనలు సడలించలేకపోవచ్చు, మనస్సుకు కొంతసేపు అస్థిరతను చేకూర్చడంతప్ప.

మరల సరోజ ఇంటి మేడమెట్లు ఎక్కాలంటే మనస్సు ఎదురు తిరుగుతోంది. కానీ అనుకున్న కార్యం సాధించాలీ అంటే ఆ మాత్రపు ఘర్షణ తప్పదు. అందునా ఇలాంటి విషయాల్లో.

సరిగ్గా అటువంటి సమయంలోనే సరోజ ఇంట్లో వున్న ముసలమ్మ వచ్చి నా ఎదురుగా నిలబడింది.

అప్పుడు సాయంత్రం ఆరుపైన అయి వుంటుంది. ఆఫీసు నుంచి వచ్చి గంటయింది. స్నానం చేసి కూర్చుని ఆలోచనల వలయంలో ఇతమిద్ధం తీసుకోలేని నిర్ణయాల సుడులలో తిరుగుతున్న సమయం అది.

''మిమ్మల్ని రమ్మంటున్నది అమ్మాయి''

''స్నేహితులు ఎవరూ లేరా?'' నా కంఠం నాకే చాలా కరుకుగా వున్నట్టనిపించింది.

ఆమె తలొంచుకునే ఎవరూ లేరన్నట్లుగా తల ఊపింది.

''వస్తాను పద'' అని ఆమెను పంపేసి రామం చెప్పిన వివరాలున్న కాగితాన్ని తీసుకుని తరువాత పది నిముషాల్లోనే సరోజ ముందు నిలుచున్నాను.

నన్ను చూస్తూనే ఆమె పరుగెడుతున్నట్లుగా ముందుకువచ్చి సంతోషంతో మొఖమంతా విశాలం చేసుకుని ''నా దగ్గర ఓ మంచి వార్త వున్నది'' అన్నది.

''ఏమిటది?''

''రమేష్ కనబడ్డాడు''

''రమేష్ ఎవరు?'' నాకు అర్థం కాలేదు. అదే ప్రశ్నించాను.

ఒక్క క్షణం ఆగింది. ఆ ఒక్క క్షణంలోనే ఆమె మొఖమంతా ఎర్రబడింది. లోపల నీరు సలసలా కాగి ఆవిరై చర్మంమీద బుడగలు తేలినట్లుగా ముఖమంతా నీటి బిందువులు ఉబ్బినాయి. ''చెప్పానుకదా. నా ఈనాటి ఈ స్థితికి కారకుడు'' ఆమె సన్నని కంఠం కూడా గుడ్లగూబ కంఠంలా కీచుమంటోంది.

నాకు కోపం గుండెల్లోనుండి జుర్రున పైకి ఎగతన్నింది.

''మీరు నాకొక్కటి చెప్పాలి. మీ ముసలమ్మ మాటల్లోలా ఇంకా స్నేహితులతో తిరగాలనే మీరు కోరుకుంటున్నట్టయితే నేను నా కాలాన్ని, శ్రమనీ, వృధా చేయడం అనవసరం. లేదూ మీరు సభ్య సమాజంలోకి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటే నేను ఎంత శ్రమయినా పడతాను'' చాలా నిష్కర్షగా చెప్పాను. ''మీరు పయనిద్దామనుకుంటున్న దారి ఏదో మీరు నిర్ణయించుకోండి. ఇలాంటి విషయాల్లో మీకు మరొకరు సలహాలు ఇవ్వగలరేగాని... బలవంతంగా మీ నెత్తిన ఏదీ రుద్దలేరు!''

మిగతా వచ్చేవారం



నేను 'కన్య'ను కాదు

ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ వున్నవాళ్లు అలాగే అసూయతో ఉక్రోషపడేవాళ్లు ఇతరులమీద ఏవేవో అభాండాలు వేసేస్తుంటారు. తెలుగులో 'పెళ్లిసందడి' తర్వాత 'ఆటోడ్రైవర్' చిత్రంలో నటిస్తున్న దీప్తిభట్నాగర్‌కి అటు ఉత్తరాదిలోనూ, ఇటు దక్షిణాదిలోనూ అవకాశాలు అంతంత మాత్రమే వున్నాయి. అయితే దీప్తి తనకు అవకాశాలు రాకపోవడానికి కారణం ఏమిటా అని ఆలోచించకుండా, అవకాశాలు చేజిక్కించుకుంటున్నవాళ్ల మీద అక్కసు వెళ్లగక్కింది. ''ఇక్కడి ఆడవాళ్లు అవకాశాల కోసం అడ్డమైన పనులన్నీ చేస్తుంటారు. అవసరపడుతాడనుకునే మగాడికి పక్కలు పరుస్తారు. నాకు మాత్రం అలా చేయడ ఇష్టం వుండదు. నచ్చిన మగాడితో ఇష్టపడి బెడ్ ఎక్కడం వేరు- అవకాశం కోసం దిగజారడం వేరు... ఎవరేమనుకున్నా నేను నా రూట్‌లోనే వెళతాను...'' ఇదే స్టేట్‌మెంట్‌లో ఆమె మరోమాట చెప్పింది- 'నేను కన్యనని జనాన్ని నమ్మించడం లేదు. అది నాకు ఇష్టంలేదు... పోనీలే అసూయతోనయినా ఆమె ఒక నిజం చెప్పింది.

-జె.వి.బాబు